
సాక్షి
అనకాపల్లి

గురువారం । 7 । మార్చి । 2024



శివపూజకు వేళాయె.. 8లో

మహాశివరాత్రి పూజలకు బలిఘట్టం, కల్యాణపులోవలను సిద్ధం చేశారు. తిరునాళ్లకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారు.



విశాఖ విజనరీ 8లో

కలల నగరం విశాఖ అన్ని రంగాల్లో మరింతగా వెలుగులీనేందుకు సీఎం జగన్ ప్రదర్శిస్తున్న దార్శనికత ప్రశంసలు అందుకుంటోంది.



మహిళా దినోత్సవం

అనకాపల్లిలో మహిళా దినోత్సవం నిర్వహించారు. న్యాయమూర్తులు శ్రీవిద్య, విజయలక్ష్మి, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

విలువలకు నిలువెత్తు సాక్ష్యం

- ఘనంగా బలిరెడ్డి విగ్రహావిష్కరణ



బలిరెడ్డికి నివాళులు అర్పిస్తున్న ధర్మశ్రీ

చోడవరం: దివంగత మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బలిరెడ్డి సత్యారావు విలువలతో కూడిన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. బలిరెడ్డి స్వగ్రామమైన చోడవరం మండలం పీఎస్‌పేట గ్రామంలో గ్రామస్తులు, కుటుంబసభ్యులు ఏర్పా టు చేసిన సత్యారావు నిలువెత్తు విగ్రహాన్ని ధర్మశ్రీ ఆవిష్కరించారు. నిజాయతీ, నిబద్ధతలతో రాణించిన బలిరెడ్డి రాష్ట్రంలో చోడవరం నియోజకవర్గానికి ఒక గుర్తింపు తెచ్చారని కొనియాడారు. వీకేపీసీపీఐఆర్‌యూడీఏ చైర్మన్ చొక్కాకుల వెంకట్రావు, బీజేపీ రాష్ట్ర ప్రతినిధి ఈర్లె శ్రీరామ్మూర్తి మాట్లాడారు. బలిరెడ్డి కుమార్తె నాగమణి, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌జీ శర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యా రావు, ఎంపీపీ కాసు అప్పారావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ఏర్పాట్లు

అనకాపల్లి: పిసినికాడ గ్రామంలో గురువారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభ నేపథ్యంలో ఇంటర్ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నట్టు ప్రజా రవాణాశాఖ జిల్లా అధికారి కె.పద్మావతి పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి అనకాపల్లి వచ్చే సర్వీసుల్లో ఎటువంటి మార్పులు చేయలేదని తెలిపారు. రోజువారీ సర్వీసులు యథావిధిగా నడుస్తాయన్నారు. వైఎస్సార్ చేయూత కార్యక్రమానికి వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం 250 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని, జిల్లాలోని డిపోలతోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి ఈ బస్సులు సమకూర్చామన్నారు. ప్రత్యేక బస్సులను మాత్రమే బహిరంగ సభకు ఏర్పాటు చేశామని, రోజువారీ సర్వీసులకు ఆటంకం లేదన్నారు.

నేటి పరీక్షకు ప్రత్యేక ఏర్పాట్లు

సీఎం సభ నేపథ్యంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఐఈవో కె.సుజాత పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు.



‘చేయూత’నిచ్చే ఆత్మీయ నేస్తం

చేయూత.. అది ఒక మాట కాదు. ధైర్యం! అది ఒక పథకం మాత్రమే కాదు.. ఎందరి జీవితాలకో భరోసా! బడుగు వర్గాలకు చెందిన మహిళలను తమ కాళ్ల మీద తాము నిలబడి తమ కుటుంబాలకు ఆదరవుగా నిలిపిన మహత్తరమైన పథకం. అన్న మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగో విడత ‘వైఎస్సార్ చేయూత’ నిధుల పంపిణీని గురువారం ప్రారంభించనున్నారు. అందుకు అనకాపల్లి మండలం పిసినికాడ వేదిక కానుండడం అనకాపల్లితో పాటు ఉమ్మడి విశాఖ జిల్లా మహిళల్లో ఉత్సాహం నింపింది.

- నేడు అనకాపల్లికి సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్ చేయూత చివరి విడత నిధుల విడుదల
- పిసినికాడ భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి
- మహిళామార్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు



సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, మంత్రి అమర్‌నాథ్



అనకాపల్లి మండలం పిసినికాడలో సిద్ధమవుతున్న సభా వేదిక

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయన గురువారం అనకాపల్లి మండలం పిసినికాడలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని వైఎస్సార్ చేయూత చివరి విడత నిధులను విడుదల చేయనున్నారు. సీఎం పర్యటనకు జిల్లా యంత్రాంగం, పోలీసులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి ఉదయం 10.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కశింకోట ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగుతారు. రోడ్డు మార్గాన 11.15 గంటలకు పిసినికాడ చేరుకొని బహిరంగ సభలో పాల్గొంటారు. 11.40 గంటల నుంచి సుమారు గంటసేపు ప్రసంగించిన అనంతరం బటన్ నొక్కి వైఎస్సార్ చేయూత చివరి విడత నిధుల పంపిణీని ప్రారంభిస్తారు. మహిళామార్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రదానం చేస్తారు. 12.55 గంటలకు బయలుదేరి కశింకోటలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 1.05 నుంచి 2.05 గంటల వరకు ప్రజాప్రతినిధులతో ముచ్చటిస్తారు. అక్కడ 2.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2.35 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగుపయనమవుతారు.

సభా ఏర్పాట్లు పూర్తి

పిసినికాడలో సీఎం బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం కాన్వాయ్, హెలిప్యాడ్ ట్రయల్ రన్ నిర్వహించారు. బహిరంగ సభకు దాదాపు 50 వేల మంది వరకు ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండడంతో పోలీసులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 1500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పార్కింగ్ ప్రదేశంలో 200 వాహనాలు పట్టేవిధంగా చర్యలు చేపట్టారు. పిసినికాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

సీఎం సభా ఏర్పాట్లను మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు. కశింకోటలో హెలిప్యాడ్, పిసినికాడలో సభా వేదికను పరిశీలించారు.

హెలిప్యాడ్ పరిశీలన

కశింకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో హెలిప్యాడ్ సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి భద్రత దృష్ట్యా బాంబు స్క్వాడ్ బృందం ఈ ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది. హెలిప్యాడ్‌పై ట్రయల్ రన్ నిర్వహించారు. విశాఖ నుంచి హెలికాప్టర్ వచ్చి ఆగి తిరిగి వెళ్లింది. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తుకు 1500మంది సిబ్బందిని వినియోగిస్తున్నామని ఎస్పీ చెప్పారు. సీఎం పర్యటన సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం, బీసీ హాస్టల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు అందంగా రంగులు వేసి ముస్తాబు చేశారు. ముఖ్యమంత్రికి స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు తమ సమస్యలు నివేదించడానికి, వినతి పత్రాలు అందజేయడానికి టెంట్లు ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లపై సమీక్ష

కశింకోట: వైఎస్సార్ చేయూతతో రాష్ట్రంలో 25 లక్షల మందికి లబ్ధి కలుగుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీ సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులతో బుధవారం సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. చేయూత నాలుగో విడత నిధుల విడుదల ఇక్కడ జరగనుండడం సంతోషదాయకమన్నారు. జిల్లా ఏర్పాటైన తర్వాత నియోజకవర్గానికి మొదటిసారి వస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రజలు, మహిళలు ఆశీర్వదించాలన్నారు. సమావేశంలో ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు పాల్గొన్నారు.



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్, బొడ్డేడ ప్రసాద్

ట్రాఫిక్ మళ్లింపు

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి మండలం పిసినికాడలో సీఎం బహిరంగ సభ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు ఎస్పీ మురళీకృష్ణ పేర్కొన్నారు. భారీ వాహనాలు, కంటైనర్లు, టిప్పర్లు, లారీలు మొదలైన వాహనాలను దారి మళ్లిస్తున్నామని చెప్పారు. గురువారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే ఆంక్షలు ఉంటాయన్నారు.

- విశాఖ నుంచి తుని వైపు జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనాలు లంకెలపాలెం జంక్షన్, పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని చేరుకోవాలి.
- తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలు తుని, రేగుపాలెం జంక్షన్, యలమంచిలి బైపాస్, అచ్యుతాపురం, పరవాడ, లంకెలపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా విశాఖ చేరుకోవాలి.
- సబ్బవరం జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలు అనకాపల్లి, లంకెలపాలెం జంక్షన్, పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి బైపాస్, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని వైపు వెళ్లవచ్చు
- చోడవరం నుంచి తుని వైపు వెళ్లే వాహనాలు అనకాపల్లి బ్రిడ్జి, మునగపాక, పూడిమడక రోడ్డు, అచ్యుతాపురం జంక్షన్, యలమంచిలి బైపాస్, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని చేరుకోవాలి.

శాంతి పార్కును సందర్శించిన జీవీఎంసీ కమిషనర్



శాంతిపార్కును పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

అనకాపల్లి: వేసవిలో వృద్ధులు, చిన్నపిల్లలు సేద తీరేందుకు పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అన్నారు. స్థానిక 82వ వార్డు పరిధిలో శారదానది ఒడ్డున గల శాంతిపార్కును బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు రూ.49 లక్షలు, ఎంపీ కోటా నిధులు రూ.10 లక్షలతో పార్కును సుందరీకరించినట్టు చెప్పారు. వ్యాయామ పరికరాలు, చిన్నపిల్లలకు ఆటవస్తువులు ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక సదుపాయలు కల్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు గైపూర్ రాజు, పలకా చంటి, కోన ఉమా, ఈతలపాక శివ, పేలూరి కల్యాణ్ పాల్గొన్నారు.

28,247 మంది రైతులకు రూ.11.30 కోట్లు

- మిచాంగ్ పంట నష్ట పరిహారం విడుదల
- వర్చువల్ విధానంలో విడుదల చేసిన సీఎం



చెక్కు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, డీఆర్‌వో దయానిధి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కరణం ధర్మశ్రీ

సాక్షి, అనకాపల్లి: గత ఏడాది డిసెంబర్ నెలలో సంభవించిన మిచాంగ్ తుపాను కారణంగా జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు బుధవారం ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. దీనికి సంబంధించిన జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో వీసీ హాల్‌లో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆధ్వర్యంలో జరిగింది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, డీఆర్వో బి.దయానిధి, జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ చిక్కాల రామారావు రైతులకు చెక్కు అందజేశారు. జిల్లాలో 28,247 మంది రైతులు నష్టపోయినట్టు గుర్తించి రూ.11.30 కోట్లు విడుదల చేశారు. రైతుల బ్యాంక్ ఖాతాల్లో నష్ట పరిహారం జమ అయింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలు నష్టపోయిన సన్నకారు, చిన్నకారు రైతన్నలను ఆదుకునేందుకు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తక్షణం ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తున్నట్టు తెలిపారు. 6,589.07 హెక్టార్ల విస్తీర్ణంలో వరి, చెరకు పంటలు నష్టపోయిన 27,956 మంది రైతులకు రూ.11,20,14,000 వ్యవసాయ శాఖద్వారా, 52.5 హెక్టార్లలో కూరగాయలు, అరటి, తమలపాకు, బొప్పాయి పంటలు నష్టపోయిన 291 మంది రైతులకు రూ.9,74,000 ఉద్యానవన శాఖ ద్వారా అందించినట్టు చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు పాల్గొన్నారు.

పంట భూమిలో ‘లక్ష్మీ’ కటాక్షం

- బయటపడిన వందేళ్ల నాటి రాతి విగ్రహం

రోలుగుంట : మండలంలోని ఎం.కె.పట్నం పంచాయతీ శివారు పెదపేట గిరిజన గ్రామానికి చెందిన రైతు కొల్లు నూకినాయుడు పంట భూమిలో లక్ష్మీ దేవి ఆకారం రాయి విగ్రహం బుధవారం బయటపడింది. రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాను దుక్కు పనులు చేసుకుంటుండగా నాగలికి గట్టిగా రాయి తగిలి నాగలి కదలక పోవడంతో, ఆపి ఆ రాయిని తొలగించే ప్రయత్నం చేయగా అది లక్ష్మీదేవి ఆకారంలో కనిపించింది. దీంతో ఈ రాతి విగ్రహాన్ని జాగ్రత్తగా వెలికి తీశారు. ఈ విగ్రహం 100 ఏళ్ల క్రితం నాటిదని స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న జనం ఈ విగ్రహాన్ని ఆసక్తిగా తిలకించారు. మహిళలు దర్శించుకొని పువ్వులతో పూజలు చేశారు.



పెదపేట రైతు పంట భూమిలో బయటపడిన లక్ష్మీదేవి రాతి విగ్రహం

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన



రిజర్వాయర్ స్నానాల రేవులో తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

రావికమతం: కల్యాణపులోవలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న తిరునాళ్ల ఏర్పాట్లను ఎస్పీ కె.వి.మురళీకృష్ణ బుధవారం పరిశీలించారు. రిజర్వాయర్‌లో స్నానాల రేవు, డ్యామ్ పరిసరాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పలు జిల్లాల నుంచి లక్షలాదిగా యాత్రికులు తరలిరానున్న నేపథ్యంలో డ్యామ్ వద్ద కంచె, బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీరు ఎక్కువగా ఉన్న దృష్ట్యా భక్తులు రిజర్వాయర్‌లోపలికి వెళ్లకుండా కర్రలతో బారికేడ్లు ఏర్పాటు చేయాలని, రాళ్లపై నాచు లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలకు తావులేకుండా గోనె సంచులను నీటి అడుగు భాగాన ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని సీఐ అప్పలనాయుడుకు సూచించారు. ఆలయ పరిసరాల్లో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని, పిల్లలు తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చోరీలు జరగకుండా నిఘా ఉంచాలని, తిరునాళ్లు పూరయ్యేవరకు అప్రమత్తతతో ఉండాలని ఆదేశించారు.

జగన్ ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం



మహాశివరాత్రి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి : చంద్రబాబుకు 2014 నుంచి 2019 వరకూ రాష్ట్ర ప్రజలు అధికారం ఇస్తే బీసీలకు రాష్ట్రంలో ఏమి న్యాయం చేశారని, ఇపుడు బీసీ సభలు ఏర్పాటు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ ప్రభుత్వంలో 25 మందికి కేబినెట్‌లో 17మందికి మంత్రులుగా గుర్తించి, రాష్ట్ర వ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, సామాజికవర్గాలకు చెందిన మహిళలకు నామినేటెడ్ పోస్టులు, పదవులు, బీసీలకు రాజ్యాంగం కల్పించిన దాని కంటే మిన్నగా ఏపీలో అధికారం ఇవ్వడం జరిగిందన్నారు. నాలుగో విడత వైఎస్సార్ చేయూత సామాజిక వర్గానికి చెందిన మహిళలకు ఇవ్వడం జరిగిందని, ఒక్కొక్కరికి నేటి వరకూ రూ.75వేలు నగదు అందజేసినట్టు తెలిపారు. బీసీలు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. బీసీలను పక్కతోవ పట్టించేందుకు చంద్రబాబునాయుడు పన్నాగాలు పన్నుతున్నారన్నారు. ఈనెల 8న జరిగే మహాశిరాత్రి వేడుకల గోడపత్రికను ఎంపీ సత్యవతి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులకు ఆమె సూచించారు.

విశాఖ విజనరీ

@ 5 ఇయర్స్.. రూ.1.05 లక్షల కోట్లు



- సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత
- అందుకే తప్పక కార్యరూపం దాలుస్తుందన్న నమ్మకం
- ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు పైగా బడ్జెట్ ప్లాన్
- విశాఖ ఆర్థికంగా మరింత బలోపేతానికి దోహదం
- 'విజన్ విశాఖ' భేష్ అంటున్న మేధావులు, విద్యా, పారిశ్రామికవేత్తలు

సాక్షి, విశాఖపట్నం: హామీలివ్వడం, వాగ్దానాలు చేయడం రాజకీయ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు పరిపాటి. వాటిని అమలు చేసే వారు అత్యంత అరుదుగా ఉంటారు. అలాంటి వారిపై ప్రజలు విశ్వాసాన్ని పెంచుకుంటారు. అంతటి విశ్వాసాన్ని సొంతం చేసుకున్న నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారు. విశ్వసనీయతకు మారు పేరుగా నిలిచారు. అందుకే ఆయన ఏ హామీ ఇచ్చినా అమలు చేసి తీరుతారన్న గట్టి నమ్మకాన్ని జనంలో ప్రోది చేసుకున్నారు. ఇప్పటికే ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నవే కాదు.. కాలానుగుణంగా ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అనతికాలంలోనే ఆచరణలో చూపారు. మునుపు అధికారంలో ఉన్న చంద్రబాబువి నోటి మాటలు, ఓటి మాటలే తప్ప అమలు చేయరన్న పేరు గడించారు. అందుకు భిన్నంగా జగన్ తీరు ఉండడంతో ఆయన ఇచ్చే వాగ్దానాలపై సామాన్యులకు గాని, సంపన్నులకు గాని, వ్యాపారవేత్తలకు గాని, పారిశ్రామికవేత్తలకు గాని, వివిధ రంగాల నిపుణులకు గాని ఎలాంటి సంశయమూ కలగడం లేదు. తాజాగా 'విజన్ విశాఖ' పేరిట విశాఖ అభివృద్ధికి లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, అందుకు రూ.1.05 లక్షల కోట్లు వెచ్చించేందుకు ప్రణాళికలు రూపొందించడం అభినందనీయం అంటూ వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. లక్ష్య సాధనకు ఐదేళ్ల సమయం నిర్దేశించుకోవడం, పదేళ్లలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు దీటుగా విశాఖను తీర్చిదిద్దేలా నిర్ణయించడం ఆహ్వానించదగ్గ పరిణామం.. ఆచరణ సాధ్యం అంటూ విజన్ విశాఖ డాక్యుమెంటును స్వాగతిస్తున్నారు. అవి వారి మాటల్లోనే..

సీఎంకు విశాఖపై స్పష్టమైన విజన్



విశాఖను అభివృద్ధి పథంలో ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న దానిపై సీఎం వైఎస్ జగన్‌కు స్పష్టమైన విజన్ ఉంది. 'విజన్ విశాఖ' ఆలోచన చాలా మంచి నిర్ణయం. విశాఖ అభివృద్ధికి నిర్ణీత ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చించేందుకు ప్రణాళికలు రూపొందించడం హర్షించదగ్గ పరిణామం. దీంతో పెట్టుబడులకు రాచబాట ఏర్పడుతుంది. పారిశ్రామికంగా విశాఖ మరింత వృద్ధి చెందుతుంది. అన్నింటా కనెక్టివిటీ విస్తృతమవుతుంది. ఫలితంగా విశాఖతో పాటు ఈ ప్రాంతంలో ఉపాధి, ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతాయి. – **జి.సాంబశివరావు,** ఎండీ, శ్రావణ్ షిప్పింగ్స్, విశాఖపట్నం

సీఎం విజన్ క్రిస్టల్ క్లియర్



విశాఖ అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విజన్ క్రిస్టల్ క్లియర్‌గా ఉంది. ఆయన ఏదైనా హామీ ఇచ్చినా, నిర్ణయాన్ని ప్రకటించినా కచ్చితంగా అమలు చేసి తీరుతారన్న నమ్మకం అన్ని వర్గాల్లోనూ ఉంది. సీఎం ప్రకటించిన విజన్ విశాఖ డాక్యుమెంట్ చాలా మంచి నిర్ణయం. దీనిని మా సీఐఐ స్వాగతిస్తోంది. విజన్ విశాఖ డాక్యుమెంట్ కూడా తప్పకుండా కార్యరూపం దాలుస్తుంది. అందులో ఎవరికీ ఎలాంటి సందేహం లేదు. 'విజన్ విశాఖ'తో నగరానికి అన్ని విధాలా కనెక్టివిటీ పెరుగుతుంది. విశాఖ మరింత శరవేగంగా అభివృద్ధి చెందుతుంది.
– **గ్రంధి రాజేష్,** సీఐఐ విశాఖ జోన్ చైర్మన్

ఏపీ భవిష్యత్తు విశాఖపైనే ఉంది..



రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి చెందగలిగే ఏకైక నగరం విశాఖే. విశాఖ అభివృద్ధి చెందితేనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుంది. హైదరాబాద్‌కు వచ్చే ఆదాయంతో తెలంగాణ ఎలా అభివృద్ధి చెందిందో వైజాగ్ కూడా అంతే. భవిష్యత్తులోనూ సంపద సృష్టించే నగరం విశాఖే. ఏపీ భవిష్యత్తు విశాఖపైనే ఉంది. ఇక్కడ ఉన్నన్ని వనరులు రాష్ట్రంలో మరెక్కడా లేవు. వైజాగ్‌ను చూపించే రాష్ట్రంలో పెట్టుబడులు తెచ్చుకునే వీలుంది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకునే సీఎం వైఎస్ జగన్ 'విజన్ విశాఖ' డాక్యుమెంట్ ప్రకటన చేశారు. ఆయన ప్రకటనను విశాఖ వాసులుగా మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. ఆయన విజన్ కల సాకారం కావాలని ఆకాంక్షిస్తున్నాం.
– **ఎస్ఎస్ శివశంకర్,** అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర చైతన్య వేదిక

రాష్ట్రానికి విశాఖ గ్రోత్ ఇంజిన్



వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ దృఢచిత్తంతో ఉన్నారని విజన్ విశాఖ డాక్యుమెంట్ ప్రకటన ద్వారా మరోసారి రుజువైంది. విశాఖ నగరం రాష్ట్రానికి ఒక గ్రోత్ ఇంజిన్‌గా నిలుస్తోంది. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ ప్లాన్ రూపొందించడం ఆహ్వానించదగ్గ పరిణామం. విజన్ విశాఖ డాక్యుమెంట్‌పై వికేంద్రీకరణ జేఏసీ హర్షం వ్యక్తం చేస్తోంది. – **లజపతిరాయ్,** వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్

ముంబైకి దీటుగా విశాఖ



పశ్చిమ తీరంలో ముంబై ఎంతలా అభివృద్ధి చెందిందో.. తూర్పు తీరంలోని విశాఖ కూడా అదే రీతిలో వృద్ధికి అవకాశం ఉంది. ఆర్థిక రాజధానిగా, విద్య, వైద్య రంగాల్లో మహా నగరాలకు దీటుగా ఉంది. చత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి వైద్యం కోసం ఇక్కడకే వస్తుంటారు. విదేశాల్లో అందే వైద్యం ఇక్కడ అందుతోంది. ఇప్పటికే ఆసియాలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే నగరాల్లో విశాఖ ముందుంది. విజన్ విశాఖతో వైజాగ్ మరింతగా అభివృద్ధి చెందుతుందనడంలో సందేహం లేదు. అభివృద్ధిలో విశాఖకు ఉన్నంత సానుకూలతలు రాష్ట్రంలో మరే నగరానికి లేవు. విజన్ వైజాగ్ కల పదేళ్లలో సాకారం అవుతుంది.
కె.శ్రీరామ్మూర్తి, రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్, ఏయూ

పొరుగు ప్రాంతాలూ అభివృద్ధి



విజన్ విశాఖ డాక్యుమెంట్ కార్యరూపం దాలుస్తుందనడంలో సందేహం లేదు. ఎందుకంటే ఆచరణ సాధ్యం చేసే ముఖ్యమంత్రి ఉండడం, అభివృద్ధికి దోహదపడే ప్రకృతి, సహజ సిద్ధ వనరులు విశాఖ సొంతం కావడం ఇందుకు దోహదం చేస్తుంది. ఇలాంటి అనుకూలతలు రాష్ట్రంలో మరే నగరానికి, ప్రాంతానికి లేవు. విజన్ విశాఖ డాక్యుమెంట్ ద్వారా విశాఖతో పాటు పొరుగున ఉన్న ప్రాంతాలూ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతాయి. లాజిస్టిక్స్, ఎగుమతులు పెరుగుతాయి. రాష్ట్రంలో అతిపెద్ద నగరం కావడం వల్ల వివిధ సంస్థల ప్రధాన కార్యాలయాలు ఇక్కడ ఏర్పాటవుతాయి. వైజాగ్ ప్రాంతానికి ఎంతో ప్రయోజనం చేకూర్చే 'విజన్ విశాఖ'ను స్వాగతిస్తున్నాం.
– **పైడా కృష్ణప్రసాద్,** ప్రెసిడెంట్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఫెడరేషన్

సీఎం అంకితభావాన్ని ఊహించలేదు



వచ్చే ఎన్నికల్లో గెలిచాక విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తామని ప్రకటించిన సీఎం జగన్‌కున్న అంకితభావం మేం ఊహించలేదు. విశాఖపై మా అంచనాలకు మించి ఆయన విజన్ ఉంది. విజన్ విశాఖ డాక్యుమెంట్‌తో ఈ విషయం స్పష్టమైంది. విజన్ విశాఖ ద్వారా రోడ్డు, వాయు కనెక్టివిటీ మరింతగా పెరుగుతుంది. విజన్ డాక్యుమెంట్ అమలైతే వైజాగ్ ముంబైతో కచ్చితంగా పోటీ పడుతుంది. విశాఖ ఐకానిక్ బిల్డింగ్ నిజంగానే ఐకానిక్‌గా మిగిలిపోతుంది.
– **కంకటాల మల్లిక్,** ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు, అధ్యక్షుడు, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్

ప్రతి పల్లెలో అభివృద్ధి, సంక్షేమం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు, స్మార్ట్ స్కూల్ భవనాలకు ప్రారంభోత్సవం



జమాదులపాలెంలో గిడ్డంగి ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



భీమునిగుమ్మం స్మార్ట్ స్కూల్లో చిన్నారులతో మంత్రి అమర్‌నాథ్, కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

కశింకోట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వెదురుపర్తిలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.25 లక్షలతో నిర్మించిన కొత్తపల్లి సచివాలయ భవనం, జమాదులపాలెంలో రూ.2 కోట్లతో నిర్మించిన గిడ్డంగిని బుధవారం ప్రారంభించారు. కశింకోట నుంచి పెదపాడు మీదుగా మునగపాకకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రాధాన్యతా భవనాలు, సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించి అభివృద్ధి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ సీఎంగా పట్టం కట్టాలని కోరారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లిబాబు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు కిషోర్, సర్పంచ్‌లు శ్యాం, రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సోమునాయుడు, మండల ప్రధాన కార్యదర్శి శేషు, భూలోకనాయుడు, ఎరుకునాయుడు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

అనకాపల్లి : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను విద్యార్థులకు అందించే విధంగా ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని మంత్రి అమర్‌నాథ్ అన్నారు. భీమునిగుమ్మం హైస్కూల్ ఆవరణలో 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో వార్డు పరిధిలో సుమారు రూ.6.76 కోట్లతో నిర్మించిన స్మార్ట్ స్కూల్ భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. రూ.3.26 కోట్లతో నిర్మించిన భీమునిగుమ్మం ప్రాథమిక పాఠశాల, రూ.3.46 కోట్లతో వేల్పులవీధి పాఠశాల, రూ.93 లక్షలతో నిర్మించిన ఏఎంసీకాలనీ పాఠశాల భవనాలను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రమేష్, పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దిలీప్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, నూకాంబిక ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, పార్టీ నేతలు కనకారావు, అనురాధ, అప్పారావు, సత్తిబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

పైసా ఖర్చు లేకుండా

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు



తారువలో రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- తారువలో 11 మందికి ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ

దేవరాపల్లి: జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి సర్వహక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువ క్యాంప్ కార్యాలయంలో స్వగ్రామం తారువకు చెందిన 11 మందికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఇంటి స్థలాలను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చారని చెప్పారు. జగనన్న కాలనీలు గ్రామాలుగా రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వీఆర్‌వో డి.స్వాతి తదితర్లు పాల్గొన్నారు.

చీడికాడ: రాష్ట్రంలో ఉన్న ప్రతి నిరుపేద అక్కచెల్లమ్మకు గూడు కల్పించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని అప్పలరాజుపురం సచివాలయం పరిధిలో ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను బుధవారం లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి నిరుపేదకు స్థలంతో పాటు హౌసింగ్ స్కీమ్ అందించి సీఎం సహకరించారన్నారు. మండలంలో 23 పంచాయతీల్లో 634 మంది అర్హులైన మహిళలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేయనున్నట్టు చెప్పారు. ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదా జానకీరాం, సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు తదిరులు పాల్గొన్నారు.

శివపూజకు వేళాయే...



బ్రహ్మ ప్రతిష్ఠించిన శివలింగం

నర్సీపట్నం : బలిఘట్టం త్రిశూల పర్వతంపై ప్రసిద్ధి చెందిన శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి మహోత్సవాలకు సిద్ధమైంది. బలిచక్రవర్తి తపస్సుకు మెచ్చిన బ్రహ్మ శివలింగాన్ని ప్రతిష్ఠించడంతో శ్రీబ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంగా ప్రసిద్ధి గాంచింది. ఈశ్వరుడు పశ్చిమ ముఖంగా ఉండి, సమీపంలో ఉన్న నది ఉత్తర ముఖంగా ప్రవహించడంతో కాశీతో సమానమని భక్తులు విశ్వాసం. ఇక్కడకు సమీపంలోనే శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయం ఉంది. అలాగే పాకలపాడు గురువుగారి ఆశ్రమం ఎంతో ప్రసిద్ధి పొందింది. ఉత్తరవాహినిలో ఉన్న శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి ఆలయం సైతం ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామి సన్నిధికి వచ్చే భక్తుల కోసం మున్సిపల్, దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తరవాహిని నదితో పాటు స్నానపు ఘాట్లను పరిశుభ్రం చేస్తున్నారు. బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ శెట్టి చిన్న తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయం సమీపంలోనే పార్కింగ్, ఐదు చోట్ల అన్నప్రసాద వితరణ కౌంటర్లు, మూడు ప్రసాద వితరణ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్టు తెలిపారు.



నాచును తొలగించడంతో పరిశుభ్రంగా మారిన కల్యాణపులోవ స్నానాల రేవు

కల్యాణపులోవలో తిరునాళ్లకు ఏర్పాట్లు

రావికమతం : మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 8 నుంచి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే కల్యాణపులోవ మహాతిరునాళ్లకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఇక్కడి పోతురాజుబాబు ఆలయానికి పలు జిల్లాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తుంటారు. రిజర్వాయర్‌లో పుణ్య స్నానాలాచరించి పోతురాజుబాబును దర్శించుకుంటారు. ఇందుకోసం ఏటా నర్సీపట్నం, అనకాపల్లి, సింహాచలం, పాడేరు డిపోల నుంచి 80 ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు వేస్తుంటారు. కాగా స్నానాల రేవులో నాచు సమస్య పరిష్కారం అయ్యింది. గతేడాది రిజర్వాయర్ నిండా నాచు అల్లుకుపోవడంతో భక్తుల పుణ్యస్నానాలకు ఇబ్బంది ఎదురైంది. దీంతో ఈ ఏడాది బోట్లు చేపలు పట్టే వలల సహాయంతో నాచును పూర్తిగా తొలగించి కాల్చివేశారు. రోడ్లపై ఉన్న గోతులను కూడా బాగు చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో ఏపుగా పెరిగిన తుప్పలను తొలగించి చదును చేయిస్తున్నారు.

విద్యుత్‌శాఖ అధికారులపై ఫిర్యాదు



చైర్‌పర్సన్ బి.సత్యనారాయణకు ఫిర్యాదు చేస్తున్న రైతు సంఘ నాయకుడు దొరపిల్ల

బుచ్చెయ్యపేట : వడ్డాది విద్యుత్‌శాఖ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరించడమే కాక స్థానికంగా ఉండడం లేదని కన్జూమర్ గ్రీవెన్స్ ఫోరం చైర్‌పర్సన్ బి.సత్యనారాయణకు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. బుధవారం వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగదార్ల సమస్యల పరిష్కార న్యాయస్థానం వేదిక జరిగింది. ప్రతి సబ్ డివిజనల్ స్థాయిలో ఉన్న వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు విశ్రాంత జిల్లా న్యాయమూర్తితో పాటు పలువురు అధికారులతో వినియోగదారుల సమస్యల వేదిక నిర్వహిస్తారు. ఈ సందర్భంగా విద్యుత్ లోఓల్టేజ్, విద్యుత్ మీటర్, సర్వీసులో లోపాలు, అదనపులోడు మంజూరు, విద్యుత్ మీటర్ పేర్ల మార్పు, విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు అందించాల్సిన పరిహారం, అధికారుల అవినీతి, ఇతర సమస్యల పరిష్కారానికి వినియోగదారులకు రైతులకు ఈ వేదిక ఉపయోగపడుతుంది. అయితే ఇంతటి ప్రాధాన్యం ఉన్న సమావేశం గురించి విద్యుత్‌శాఖ అధికారులు ఎవరికీ తెలియకుండా గుట్టుగా నిర్వహించారు. దీంతో బుధవారం వడ్డాది సబ్ డివిజన్‌లో ఉన్న బుచ్చెయ్యపేట, రావికమతం, మాడుగుల మండలాల నుండి కనీసం పది మంది కూడా హాజరు కాలేదు. వడ్డాది విద్యుత్‌శాఖ ఏడీ స్థానికంగా ఉండడం లేదని, ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు విధుల పట్ల అంకిత భావంతో పని చేయడం లేదని, అనుభవం లేని ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తున్నారని , పలువురు సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని, షిఫ్ట్ డ్యూటీలు సక్రమంగా చేయడం లేదని వడ్డాది రైతు సంఘ నాయకులు శిరిగిరిశెట్టి దొరపిల్ల,బొబ్బాది రాజు తదితరులు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి చూసి పార్టీలో చేరా..



మంత్రి అమర్‌నాథ్, భరత్‌కుమార్‌తో దేముడుబాబు, పార్టీ నాయకులు

అనకాపల్లి : మండలంలో తుమ్మపాల పంచాయతీ తుమ్మపాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ డీసీసీ జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి దేముడుబాబు తమ స్వగృహంలో బుధవారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో పార్టీ తీర్థం తీసుకున్నారు. బుదిరెడ్డి దేముడుబాబుకు అమర్‌నాథ్ వైఎస్సార్‌సీపీ పార్టీ కండువాను వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేముడుబాబు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, అనకాపల్లి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత తనపై ఉందని ఆయన పేర్కొన్నారు. 35 సంవత్సరాల రాజకీయ చరిత్రలో ఇటువంటి సంక్షేమ పథకాలను ఏ ప్రభుత్వంలోను చూడలేదని, కరోనా వంటి విపత్తుల సమయంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎంకే దక్కిందని అన్నారు. అనంతరం దేముడుబాబుతో పాటు సుమారు 80 యువకులు పార్టీలోకి చేరారు. పార్టీలో చేరిన వారిలో బుదిరెడ్డి దిలీప్‌కుమార్, ఉదయ్‌కుమార్, మార్టూరు నూకనాయుడు, కసుబుడ్డి నానాజీ, మార్టూరు చిన్నఅబ్బాయి, గాలి నర్సింగరావు, శ్రీను ఉన్నారు. అంతకుముందు దేముబుబాబు మంత్రి అమర్‌నాథ్, నియోజవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌లను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దిలీప్‌కుమార్, ఎంపీపీ సూరిబాబు, తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, మాజీ జెడ్పీటీసీ మలసాల ధనమ్మ పాల్గొన్నారు.

నిన్న లేని అందమేదో..



ఇల్లు ఇచ్చి ఆదుకున్నారు



కశింకోటలోని వడ్డీ వీధిలో పెంటకోట నాగేశ్వరరావు వైఎస్సార్ జగనన్న లే–అవుట్‌లో నివాసం ఉంటున్నారు. భార్య నాగమణి, కుమారుడు కుమార్, కుమార్తె కోమలి కుటుంబ సభ్యులు. ఇతను ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నారు. చాలా కాలంగా సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లో నివాసం ఉండేవారు. వైఎస్సార్ జగనన్న లే- అవుట్‌లో స్థలం, ఇల్లు మంజూరు చేశారు. దీంతో ఇల్లు నిర్మించుకుని మూడు నెలల నుంచి కుటుంబంతో నివాసం ఉంటున్నారు. సొంత ఇల్లు సమకూరినందుకు నాగేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. ఇల్లు ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

- నూతన రహదారులు.. పాఠశాలలు, సచివాలయ భవనాలు, కల్యాణ మండప నిర్మాణంతో కాంతులీనుతున్న కశింకోట
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్థానికుల ధన్యవాదాలు



నాడు-నేడులో అందంగా తీర్చిదిద్దిన బాలికల హైస్కూల్



వడ్డి వీధిలో నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న మెగా లే-అవుట్‌లో భారీ గృహ నిర్మాణం



అరబిందో ఫార్మా పరిశ్రమ సహకారంతో నిర్మించిన కల్యాణ మండపం

కశింకోట : అభివృద్ధికి కశింకోట గ్రామం చిరునామాగా నిలుస్తోంది. ఇక్కడి గ్రామాలు గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందాయి. గత ఐదేళ్ల కాలంలో సుమారు రూ. 10 కోట్లతో ఇక్కడ ఎంతో అభివృద్ధి జరిగింది. అడుగడుగునా రోడ్లు, కాలువలు నిర్మించారు. ఇంకా నిర్మిస్తున్నారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కశింకోట గ్రామం.. నియోజకవర్గంలో మేజర్ పంచాయతీల్లో ఒకటి. ఇక్కడ సుమారు 20 వేల జనాభా ఉంది. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత జనాభా ప్రాతిపదికన నాలుగు సచివాలయాలు ఏర్పాటు చేశారు. వాటికి రూ.కోటీ 60 లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కశింకోట గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు ముమ్మరంగా నిధులు సమకూర్చారు. ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి చేదోడుగా నిలిచారు. దీంతో గ్రామంలోని దాదాపు అన్ని వీధుల్లోను రూ.6.75 కోట్లతో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించారు. గవరపేట, మేదర వీధి, రౌతు వీధి, ఉప్పునీటి దిబ్బ, పూసర్ల వీధి, హౌసింగ్ కాలనీ, కనకమహాలక్ష్మి వీధి, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించారు. కోమటి వీధి రోడ్డు మట్టితో నిర్మించినది కావడంతో ఏ మాత్రం వర్షం వచ్చినా రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో తాజాగా సిమెంట్ రోడ్డు వేయడంతో ఏళ్ల తరబడి పడుతున్న కష్టాలు తొలగాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం, ప్రత్యేక నిధులు, జెడ్పీ నిధులు, రూ.45 లక్షల ఎంపీ నిధులతో వీటిని నిర్మించారు. మరో రూ.50 లక్షలతో పనులు జరుగుతున్నాయి. అలాగే ఇళ్ల నిర్మాణం కూడా వేగంగా సాగుతోంది. వడ్డివీధి, కోట వీధి, గాడివీధి, సత్తెమ్మ కాలనీ ప్రాంతాల్లో వైఎస్సార్ జగనన్న లే-అవుట్లు ఏర్పాటు చేసి 568 మందికి ఇళ్లు మంజూరు చేశారు. దీంతో వీటిలో 280 మంది ఇప్పటికే ఇళ్లు నిర్మించుకుని చాలా మంది గృహ ప్రవేశాలు చేసి నివాసం ఉంటున్నారు. వడ్డి వీధి లే అవుట్ పెద్దది. ఈ లే అవుట్‌లో ఎకరం రూ.66 లక్షల వంతున రైతుల నుంచి భూమి కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. దీంతో లే-అవుట్‌లో దాదాపు సగం మంది వరకు ఇళ్లు నిర్మించుకున్నారు. అలాగే బాలికల హైస్కూలు, బాల బాలికల ప్రాథమిక పాఠశాలలను సుమారు రూ.కోటితో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నాడు–నేడులో భాగంగా అందంగా తీర్చిదిద్దారు. మరో రూ. 36 లక్షలతో బాలికల హైస్కూల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.65 లక్షలతో మరమ్మతులు చేసి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. సీఎస్ఆర్ నిధులతో అరబిందో ఫార్మా పరిశ్రమ సహకారంతో సుమారు రూ.కోటితో కల్యాణ మండపాన్ని కూడా ఆధునిక వసతులతో స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట అందరికీ అందుబాటులో నిర్మించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంత భారీ ఎత్తున అభివృద్ధి చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అభివృద్ధి పనులు.. చేసిన ఖర్చు వివరాలు

సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణం
రూ.6.75 కోట్లు

సచివాలయ భవనాల నిర్మాణం
కోటి 60 లక్షలు

నాడు-నేడులో 3 పాఠశాలల అభివృద్ధి
రూ.కోటి

నాడు-నేడులో పీహెచ్‌సీ అభివృద్ధి
రూ.65 లక్షలు



గవరపేట మధ్య వీధిలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



హౌసింగ్ కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

సిమెంట్ రోడ్లు వేశారు..



మేము కశింకోట గవరపేట మధ్య వీధిలో నాలుగు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నాం. భార్య ప్రభావతి, ముగ్గురు పిల్లలు మా కుటుంబం. మా ప్రాంతంలో రోడ్లు గోతులు పడి అధ్వానంగా ఉండేవి. దీనివల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడేవారం. ఈ నేపథ్యంలో తాజాగా సిమెంట్ రోడ్లు వేశారు. దీంతో రాకపోకలు సాగించడానికి సౌకర్యవంతంగా ఉంది.

పులపర్తి రంగనాయకులు, గవరపేట, కశింకోట

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



నేను పూసర్ల వీధిలో నాలుగు దశాబ్దాలుగా నివసిస్తున్నాను. గతంలో ఎన్నడూ లేని విధంగా మా ప్రాంతంలో సిమెంట్ రోడ్లు వేశారు. మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ఇప్పుడు మాకు ఎంతో సౌకర్యవంతంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మా వీధిలో అందరి తరఫున ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.

– ధర్మిశెట్టి అప్పయ్యమ్మ, పూసర్లవీధి, కశింకోట

గతం కంటే ఎంతో అభివృద్ధి..



కశింకోటలోని గవరపేటలో మూడు దశాబ్దాలుగా నివసిస్తున్నాం. నా భర్త మహాలక్ష్మి నాయుడు, కుమారుడు, కుమార్తె అంతా కలిసే ఉంటాం. మేం నివసిస్తున్న ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా మారుమూల ప్రాంతంలో కూడా సిమెంట్ రోడ్లు వేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాం.

– దాడి లోవ సంతోషి, గవరపేట, కశింకోట

క్లుప్తంగా

'బీసీలకు రాజ్యాధికారం ఇచ్చే పార్టీలకే మద్దతు'

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు రాజ్యాధికారం ఇచ్చే పార్టీలకు తమ మద్దతు ఉంటుందని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు మొల్లి రమణబాబు అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాదిగా బీసీలను ఓటుబ్యాంక్‌గానే వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్నా..రాజకీయంగా వెనుకంజలోనే ఉన్నామని పేర్కొన్నారు. కులవృత్తి పరికరాల కొనుగోలుకు ఇస్తున్న రూ.10వేలను ప్రభుత్వం పెంచాలని కోరారు. సమావేశంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు పెద్దపాటి కల్యాణి, ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి పిల్లల శంకర్, ప్రధాన కార్యదర్శి కృష్ణంనాయుడు, అనకాపల్లి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శులు జగ్గ అప్పారావు, సిమ్మా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

అనకాపల్లి : గవరపాలెం సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆలయ పాలకవర్గ సభ్యులకు సూచించారు. మండలంలో పిసినికాడ సీఎం జగన్ సభాస్థలి వద్ద బుధవారం ఆయన శివరాత్రి ఉత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్లు ఆళ్ల నాగేశ్వరరావు, కేఎం నాయుడు, అర్చకులు పెరూరి పరమేశ్వరరావు, పార్టీ నేతలు ఉగ్గిన అప్పారావు, కొణతాల అప్పాజీ పాల్గొన్నారు.

167 మందికి వైద్య సేవలు

కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల 167 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

పొంగలిపాకలో...

మాడుగుల రూరల్: కింతలి పీహెచ్‌సీ పరిధిలో పొంగలిపాక గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 49 మందికి వైద్యాధికారి కె.ఎం.నాయుడు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్‌ఎం లక్ష్మి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 6,284 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,870	4,680
మొదటి రకం	3,500	4,300
రెండో రకం	3,380	3,770
మూడోరకం	3,250	3,510

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:	రాజా
ఆపరేషన్ వాలెంటైన్	:	సత్యనారాయణ స్క్రీన్-1
భ్రమయుగం	:	సత్యనారాయణ స్క్రీన్-2
సిద్ధార్థ రాయ్	:	షిర్డీసాయి
ఊరు పేరు భైరవకోన	:	పర్తిసాయి
వ్యూహం	:	వేంకటేశ్వర
ఇంటి నెం.13	:	శ్రీసత్య
చారి 111	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 83 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-45 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 396 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 313 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

నాయీ బ్రాహ్మణ వీధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



నాయీబ్రాహ్మణ వీధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కోరుకొండ రాఘవ

అనకాపల్లి : స్థానిక కోట్ని వీధి నాయీ బ్రాహ్మణ వీధిలో లోటల్టేజీ సమస్యతో సుమారు 10 సంవత్సరాలుగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే 100 కేవీ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు జరిగిందని 84వ వార్డు పార్టీ ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ అన్నారు. బుధవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని వార్డు పరిధిలో విద్యుత్ సమస్యలు ఏర్పడకుండా ముందుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విద్యుత్ సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో నాయీ బ్రాహ్మణ వీధిలో ప్రజలు ప్రభుత్వాన్ని అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ ఎం. శ్రీనివాసరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ పేరపు రాంబాబు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలంటూ పూజలు



లలితాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం సతీమణి రమణమ్మ

చీడికాడ: వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ అప్పలరాజుపురంలోని శ్రీలలితా దేవి, చీడికాడ శివాలయం, తురువోలు ఆలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ బుధవారం పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పలు కుటుంబాలను కలిసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆమె వెంట ఎంపీపీ కురచా జయమ్మ, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, పార్టీ నేతలు చుక్కా అప్పలనాయుడు, షేక్ సూర్యానారాయణ, గెంజి బాలాజీ, ఈర్లె చైతన్య, పరువాడ మహేష్‌తో పాటు దేవరాపల్లి, కె.కోటపాడుకు చెందిన పార్టీ నేతలున్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

గొలుగొండ: రావణాపల్లిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని రథంపై ఊరేగించి, సారె సమర్పించారు. ఊరేగింపు సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చోద్యం పీఏసీఎస్ చైర్మన్ పెద్దిరాజు, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వయం భూ లింగాన్ని తాకిన సూర్యకిరణాలు

మాకవరపాలెం: స్వయం భూ లింగాన్ని సూర్యకిరణాలు తాకాయి. పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వయం భూలింగాన్ని ఏటా శివరాత్రి ముందు సూర్యకిరణాలు తాకుతాయి. ఈ నేపథ్యంలో బుధవారం కూడా లింగాన్ని సూర్య కిరణాలు తాకాయి.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు



విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన సామగ్రి అందజేస్తున్న హరికృష్ణ, హెచ్ఎం రుధిరరాణి

అనకాపల్లి : టెన్త్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఇష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని జీవీఎంసీ వేల్పులవీధి హైస్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ విల్లూరి హరికృష్ణ అన్నారు. బుధవారం హైస్కూల్ ఆవరణలో టెన్త్ విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారని, డిజిటల్ తరగతుల ద్వారా ఎన్నో ప్రయోజనలు ఉన్నాయన్నారు. అనంతరం దొడ్డి సరస్వతమ్మ భర్త జ్ఞాపకార్థం పదో తరగతి విద్యార్థులకు పరీక్షకు ఉపయోగపడే వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.రుధిరరాణి, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

నేత్రదానంతో నలుగురికి చూపు



కేక్ కట్ చేస్తున్న సభ్యులు

అనకాపల్లి: నేత్రదానంతో నలుగురికి చూపు ప్రసాదించినట్లని విశాఖ ఎల్‌వీ. ప్రసాద్ కంటి ఆస్పత్రి కో-ఆర్డినేటర్ కాత్యాయిని అన్నారు. ఏ వయసులో వారైనా నేత్రదానం చేయవచ్చని, చనిపోయిన ఎనిమిది గంటల్లోపు నేత్రాలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెలవారీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఒక వ్యక్తి నల్లగుడ్డులో ఐదుపొరలు ఉంటాయని, సదరు వ్యక్తి నేత్రదానం చేస్తే నలుగురికి చూపు అందించిన వారవుతారని వివరించారు. సమావేశంలో సుమారు పదిమంది నేత్రదానం చేయుటకు ముందుకు వచ్చి, పేర్లు నమోదు చేసుకున్నారు. మార్చిలో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న సుమారు 15 మంది సభ్యులకు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేయించారు. మధ్యాహ్నం విందు ఏర్పాటు చేశారు. కేవీ గౌరీపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సుమారు 150 మంది సీనియర్ సిటిజన్ సభ్యులు, కార్యదర్శి వీఎల్ఎం శర్మ, కోశాధికారి వెల్లూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎంబీవీ.స్వామి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

81 మందికి నేత్ర వైద్య పరీక్షలు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేటలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరంలో 81 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. స్థానిక కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సుంకరి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు హరిచందన, క్యాంపు కో ఆర్డినేటర్ అరుణ్‌కుమార్ రోగులను పరీక్షించారు.

ప్రజారోగ్యానికి 'సురక్ష'

- 83వ వార్డులోని శిబిరంలో 220 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులకు బీపీ పరీక్షిస్తున్న సిబ్బంది



మహిళకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు



-రోగికి సంబంధించిన వివరాలపై ఆశ వర్కర్‌తో మాట్లాడుతున్న వైద్యుడు

అనకాపల్లి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు వైద్య సేవలు మరింత చేరువయ్యాయన్నారు. స్థానిక 83వ వార్డులోని సచివాలయం పరిధి-8లో మళ్లవీధి కల్యాణమండపంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షకు మొదటిదశలో మంచి స్పందన రావడంతో రెండో విడత కార్యక్రమాన్ని సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో వ్యాధుల బారిన పడిన రోగులు పట్టణంలోని ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదని, ప్రజలు ఎంతో వ్యయప్రయాసలకు గురయ్యేవారని అన్నారు. ఇప్పుడు ప్రజలకు చేరువలోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తుండటంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సురక్ష శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, గైనకాలజిస్ట్, కంటి వైద్యుడు పాల్గొని, 220 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. ఇద్దరు రోగులను అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి రిఫర్ చేసినట్లు రమేష్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్ల నొప్పికి మందులు ఇచ్చారు



ఏడాది నుంచి మోకాళ్ల నొప్పితో బాధపడుతున్నా. డాక్టర్లు పరీక్షించి, సూచనలు ఇచ్చారు. ఎక్కువగా ఆకుకూరలు, జిగురుకూరలు తీసుకోవడం ద్వారా ముడుకుల నొప్పుల నుంచి ఉపశమనం దొరుకుతుందని చెప్పారు. నొప్పులు తగ్గేందుకు మూడు రకాల మందులు ఇచ్చారు.

– సూరిశెట్టి ఛాయాదేవి, మళ్లవీధి

డాక్టర్ చాలా బాగా చూశారు



నాకు షుగర్, బీపీ ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రిలో ఇచ్చిన మందులు వాడుతున్నా. ఇటీవల కంటి సమస్యతో బాధపడుతున్నా. ఏఎన్ఎం ఇంటికి వచ్చినప్పుడు ఆమెకు నా కంటి సమస్య గురించి చెప్పాను. సురక్ష వైద్యశిబిరంలో చూపించుకుంటే, డాక్టర్లు పరీక్షించి మందులు ఇస్తారని, కళ్లద్దాలు పడితే ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఆమె చెప్పినట్లే డాక్టర్లు చాలా బాగా పరీక్షించారు. కళ్లద్దాలు ఉచితంగా ఇచ్చారు.

– దొడ్డి చినతల్లి, మళ్ల వీధి



రోగి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగి

ఎన్నికల విధుల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు అవకాశం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

చోడవరం రూరల్: ఎన్నికల్లో సేవలందించే అవకాశాన్ని ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు కల్పించారని, అలా విధులు నిర్వహించే వారికి ప్రశంసాపత్రాలు అందచేస్తారని జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రత్నభారతి, డి.మాల్యాద్రి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఓటుహక్కు విలువ తెలుసుకోవడమే కాకుండా ఇతరులకు ఓటు ప్రాధాన్యతను వివరించి చైతన్యవంతులను చేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు వీలుగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు శిక్షణఇవ్వాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపన్యాసకులు ఎస్ఎం. రఫీఉద్దీన్, అల్యూమిని కోఆర్డినేటర్ జి.నారాయణమూర్తి, సుధీర్, వి.అప్పలనాయుడు, ఎ.కృష్ణారావు, ఐ.వి.సత్యవతి, లక్ష్మీమంగమ్మ పాల్గొన్నారు.